సాక్షి
తిరుపతి

బుధవారం । 25 । సెప్టెంబర్ । 2024



అంతరిక్ష పరిశోధనల్లో అగ్రగణ్యుడు

భారత అంతరిక్ష పరిశోధనలను కొత్త పుంతలు తొక్కించడంలో ప్రొఫెసర్ సతీష్ ధవన్ విశేషంగా కృషి చేశారు. - 8లో



సముద్రంలో 'అల'జడి

అల్పపీడన ప్రభావంతో తూపిలిపాళెం వద్ద సముద్రంలో అలలు ఉవ్వెత్తున ఎగసి పడుతున్నాయి. - 8లో



ప్రాధాన్యత రంగాలకు రుణాలు

జిల్లాలో ప్రాధ్యానత రంగాలకు బ్యాంకర్లు రుణాలు మంజూరు చేయాలని ఎంపీ గురుమూర్తి ఆదేశించారు. - 8లో

న్యూస్‌రీల్

శుకబ్రహ్మాశ్రమానికి శరవానంద్ స్వామిజీ



అంజూరు శ్రీనివాసులును ఆశీర్వదిస్తున్న శరవానంద్ స్వామిజీ

శ్రీకాళహస్తి: శుకబ్రహ్మాశ్రమానికి ఉత్తరప్రదేశ్‌కు చెందిన శరవానంద్ స్వామిజీ మంగళవారం విచ్చేశారు. ఆశ్రమ పీఠాధిపతి విద్యాస్వరూపానందగిరిస్వామి, శ్రీకాళహస్తీశ్వరాలయ పాలక మండలి మాజీ చైర్మన్ అంజూరు తారక శ్రీనివాసులు స్వాగతంపలికారు. శరవానందర్ స్వామీజీ మాట్లాడుతూ ముక్కంటీశ్వరుని దర్శించుకోవడం ఆనందంగా ఉందన్నారు. అనంతరం ఆయనకు అంజూరు తారక శ్రీనివాసులు జ్ఞాపిక బహూకరించారు. కార్యక్రమంలో పేట జనార్దన్, అయితా మురళి, ఉదయ్‌కుమార్ పాల్గొన్నారు.

27 నుంచి ఎస్‌జీఎఫ్ ఎంపిక పోటీలు

తిరుపతి ఎడ్యుకేషన్ : స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ (ఎస్‌జీఎఫ్) ఆధ్వర్యంలో వివిధ క్రీడల్లో అండర్-19 బాలబాలికల జట్ల ఎంపిక పోటీలు నిర్వహించనున్నట్లు కార్యదర్శి ఎస్.జయరామయ్య తెలిపారు. మంగళవారం ఆయన మాట్లాడుతూ ఈ నెల 27వ తేదీ ఉదయం 9.30గంటలకు రేణిగుంట బాలికల జెడ్పీ హైస్కూల్‌లో సపక్‌తక్రా, 28 మధ్యాహ్నం 2గంటలకు చంద్రగిరి ప్రభుత్వ జూనియర్ కళాశాల ఆవరణలో సాఫ్ట్‌బాల్, 30 మధ్యాహ్నం 2గంటలకు తుమ్మలగుంట తుడా పార్కు మైదానంలో కబడ్డీ పోటీలు నిర్వహించనున్నట్లు వెల్లడించారు. ప్రస్తుతం ఇంటర్ చదువుతున్న బాలబాలికలు పోటీల్లో పాల్గొనేందుకు అర్హులన్నారు. క్రీడాకారులు తప్పనిసరిగా 10వ తరగతి మార్కుల జాబితా, స్టడీ సర్టిఫికెట్, ఆధార్ కార్డు జిరాక్స్‌ను వెంట తీసుకురావాలని సూచించారు.

పీహెచ్‌సీ సేవలకు ప్రశంసలు



బీఎన్‌కండ్రిగ పీహెచ్‌సీ ఎదుట వైద్యసిబ్బందితో విదేశీ బృందం

బుచ్చినాయుడుకండ్రిగ : బీఎన్ కండ్రిగ పీహెచ్‌సీని ఇథియోపియాకు చెందిన వైద్యులు మంగళవారం సందర్శించారు. ట్రీమ్ ప్రాజెక్టులో భాగంగా ఫర్ హెల్త్ బేబీ కార్యక్రమం కింద గర్భకోశ నిపుణులు, చిన్నపిల్లల వైద్యులు, సామాజిక ఆరోగ్య అధికారులతో కూడిన బృందంతోపా ఎస్వీ మెడికల్ కాలేజీ అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టరు వాసిం, కమ్యూనిటీ మెడిసిన్ డాక్టర్ వినాయక్, డాక్టరు హరి, డాక్టరు వైష్ణవి పర్యటనకు విచ్చేశారు. గ్రామీణ పీహెచ్‌సీలో గర్భిణులు, పిల్లలకు ఆశ కార్యకర్తలు, ఏఎన్ఎంలు, ఎంఎల్‌హెచ్‌పీలు ఎలాంటి వైద్య సేవలందిస్తున్నారో క్షేత్రస్థాయిలో పరిశీలించారు. 104, 108, 102 సేవలపై ఆరా తీశారు. ఈ సందర్భంగా గర్భిణులకు ప్రభుత్వం అందించే పారితోషికాలను ఆరోగ్యాధికారి వెంకటేశ్వర్లు వివరించారు. ఇలాంటి విశిష్ట సేవలను తమ దేశంలో కూడా అమలు చేస్తామని విదేశీ వైద్యులు వెల్లడించారు. అనంతరం వీఎస్ పురం వెల్‌నెస్ సెంటర్‌ను సందర్శించారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్లు జ్యోతి, పద్మశ్రీ, ఈశ్వరీ, ఆకాజ్యోతి, పాల్గొన్నారు.

30 వరకు ఈకేవైసీ గడువు పొడిగింపు

తిరుపతి అర్బన్ : రైతులు తమ పంట వివరాలను ఈ-క్రాప్‌లో భాగంగా ఈకేవైసీ చేయించుకునేందుకు ఈ నెల 30వ తేదీ వరకు గడువు పొడిగించినట్లు వ్యవసాయ సహాయ సంచాలకుడు ధనంజయరెడ్డి తెలిపారు. మంగళవారం ఆయన మాట్లాడుతూ జిల్లాలో మరో 1,300 మంది రైతులు ఈకేవైసీ చేయించుకోవాల్సి ఉందని, వందశాతం పూర్తి చేయడమే లక్ష్యంగా పనిచేస్తున్నట్లు వెల్లడించారు.

పక్కాగా విజన్ డాక్యుమెంట్ పోస్టర్లు

తిరుపతి అర్బన్ : జిల్లా విజన్ డాక్యుమెంట్స్ పక్కాగా ఉండేలా గోడపత్రికలను ఏర్పాటు చేయాలని కలెక్టర్ వెంకటేశ్వర్ ఆదేశించారు. మంగళవారం కలెక్టరేట్‌లో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా స్వర్ణాంధ్ర-2047పై అధికారులకు అవగాహన కల్పించారు. కలెక్టర్ మాట్లాడుతూ గడువు లోపు మండల, డివిజన్, జిల్లా డాక్యుమెంట్స్ సిద్ధం చేయాలని స్పష్టం చేశారు. ప్రభుత్వ కార్యాలయాల వద్ద క్యూఆర్ కోడ్ ఏర్పాటు చేయాలని సూచించారు. దీని ద్వారా ప్రభుత్వంపై ప్రజలు తమ అభిప్రాయాలు, లోటుపాట్లును తెలియజేందుకు అవకాశముంటుందని వివరించారు.



అపచారం.. అసత్యం

సాక్షాత్తు శ్రీమహావిష్ణువు కొలువైన తిరుమలను ముఖ్యమంత్రి చంద్రబాబు స్వార్థ రాజకీయాలకు వేదికగా మార్చుకున్నారు. శ్రీవారి పవిత్ర లడ్డూ ప్రసాదంపై విషం కక్కుతున్నారు. భక్తుల మనోభావాలు దెబ్బతీసేలా దుష్ప్రచారం చేస్తున్నారు. నెయ్యిలో జంతువుల కొవ్వు కలిసిందంటూ ఆధారాలు లేని ఆరోపణలతో హైందవజాతినే కించపరుస్తున్నారు. అయితే టీటీడీ ఈఓ శ్యామలరావు.. మంత్రి లోకేష్ మాత్రం కల్తీ జరిగిందనే అనుమానంతో నెయ్యి ట్యాంకర్లను వెనక్కుపంపినట్లు సన్నాయినొక్కులు నొక్కుతున్నారు. ప్రసాదాల తయారీపై అడ్డదిడ్డమైన వ్యాఖ్యలతో కూటమి నేతలు.. ప్రజాప్రతినిధులు తమను తీవ్రంగా అవమానిస్తున్నారని తిరుపతి వాసులు మండిపడుతున్నారు. చిత్తశుద్ధి ఉంటే టీటీడీ బోర్డు మాజీ చైర్మన్ భూమన కరుణాకర రెడ్డి తరహాలో శ్రీవారి అఖిలాండం వద్ద ఈఓతో కలిసి ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రమాణం చేయాలని స్పష్టం చేస్తున్నారు.

– సాక్షి ప్రతినిధి, తిరుపతి/తిరుపతి సిటీ

- సీఎం ఒక మాట.. ఈఓ మరో మాట
- భక్తుల మనోభావాలతో ఆటలు
- విషం కక్కుతున్న కూటమి నేతలు
- మండిపడుతున్న తిరుపతి వాసులు



'సూపర్‌సిక్స్'పై దృష్టి మరల్చేందుకే..



సూపర్‌సిక్స్ హామీలు నెరవేర్చలేక ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ప్రజల దృష్టి మరల్చేందుకు తిరుమల లడ్డూపై రాద్ధాంతం చేస్తున్నారు. స్వార్థ రాజకీయాల కోసం శ్రీవారి ప్రసాదాన్ని అపవిత్రం చేస్తున్నారు. గతంలో చంద్రబాబు ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు 15 సార్లు నెయ్యి ట్యాంకర్లు తిరుమలలో తిరస్కరణకు గురయ్యాయి. అదే వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో 18 పర్యాయాలు నెయ్యి నాణ్యత లేదని వెనక్కిపంపించారు. టెండర్ నోటిఫికేషన్‌లో పేర్కొన్న మేరకు నెయ్యి నాణ్యత ఉంటేనే టీటీడీ తీసుకుంటుంది. 14 ఏళ్ల ముఖ్యమంత్రిగా పనిచేసిన చంద్రబాబుకు ఈ విషయం తెలియదా. జగనన్నకు చిత్తశుద్ధి ఉంది కాబట్టే విచారణ కోరుతూ ప్రధానికి లేఖ రాశారు. – నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి

పొంతన లేని మాటలు



తిరుమల లడ్డు ప్రసాదంపై అసత్య ప్రచారం చేయడం దారుణం. ఈఓ గతంలో మాట్లాడినప్పుడు కల్తీ జరిగిన నాలుగు ట్యాంకర్లను వెనక్కి పంపామన్నారు. కానీ, సీఎం చంద్రబాబు, మంత్రి లోకేష్ మాత్రం కల్తీ నెయ్యి వినియోగించారని స్పష్టంగా చెబుతున్నారు. ఏది నిజమో తెలియక భక్తులు ఆయోమయానికి లోనవుతున్నారు. మొత్తం మీద ఇది నూతన ప్రభుత్వం ఏర్పడిన తర్వాత జరిగిన విషయంగా అర్థమవుతోంది. గత ప్రభుత్వానికి సంబంధం లేనట్లు వారి మాటల్లోనే తేటతెల్లమవుతోంది.

– పార్థసారథి, వ్యాపారి, తిరుపతి

నివేదిక బయటపెట్టాలి



కూటమి ప్రభుత్వం ఎన్‌డీడీబీ అనే సంస్థ ఇచ్చిన నివేదిక ప్రామాణికంగా తీసుకుంది. కేంద్ర ప్రభుత్వ సంస్థ ఇచ్చిన నివేదికపై స్పందించడం లేదు. మైసూరుకు చెందిన సంస్థ పరీక్షించిన శ్యాంపుల్స్, వాటి ఫలితాలతో కూడిన నివేదికను తక్షణం బయటపెట్టాలి. ఆ నివేదికను ఎందుకు దాచిపెడుతున్నారో అంతుబట్టడం లేదు. దీనిపై ఈఓ సైతం సమాధానం చెప్పకపోవడం విడ్డూరంగా ఉంది. రాజకీయాలకు టీటీడీని వాడుకోవడం సరికాదు. – సుబ్రమణ్యం, రిటైర్డ్ ఉద్యోగి, తిరుపతి

ఆలోచింపజేసింది



కాణిపాకంలోనిత్యం సామాన్య ప్రజల నుంచి ఉన్నత స్థాయి వ్యక్తులు పలు అంశాలపై నిజాలు తెలుసుకునే ప్రయత్నంలో భాగంగా ప్రమాణం చేస్తుంటారు. కానీ శ్రీవారి ప్రసాదానికి ఉపయోగించే నెయ్యిలో ఎటువంటి కల్తీ జరగలేదని టీటీడీ బోర్డు మాజీ చైర్మన్ సాక్షాత్తు తిరుమల దేవాలయం ఎదుట ప్రమాణం చేయడం భక్తులను ఆలోచింపజేసింది. ప్రమాణం చేయకూడదని ఆయనను పోలీసు బలగాలతో అడ్డుకునే ప్రయత్నం చేసి కేసులు నమోదు చేయడం అన్యాయం.

– ఆదిలక్ష్మి, భక్తురాలు, తిరుపతి

మనసులను కదిలించింది



టీటీడీ బోర్డు మాజీ చైర్మన్ భూమన కరుణాకరరెడ్డి సోమవారం శ్రీవారి పుష్కరిణిలో పవిత్ర స్నానం ఆచరించి కొబ్బరికాయ కొట్టి హారతి ఇస్తూ చేసిన ప్రమాణం భక్తుల మనసులను కదిలించింది. తప్పు చేసిన వ్యక్తులు కలియుగ దైవం ఎదుట అంత ధైర్యంగా ప్రమాణం చేయలేరు. ఇదో చరిత్రగా నగర ప్రజలు చర్చించుకుంటున్నారు. ప్రసాదాల తయారీలో ఉపయోగించే నెయ్యి విషయంలో తాను ఏ తప్పు చేయలేదు.. చేసి ఉంటే శిక్ష విధించు అంటూ గొంతెత్తి చాటడం ఆలోచింపజేసే విషయం.

– వి.రామకృష్ణారెడ్డి, రిటైర్డ్ టీచర్, తిరుపతి

సుప్రీంకోర్టు సుమోటోగా తీసుకోవాలి



దేశ అత్యున్నత న్యాయ స్థానం సుప్రీంకోర్టు నెయ్యి కల్తీ విషయాన్ని సుమోటోగా తీసుకుని కేసును విచారించాలి. అప్పుడే వాస్తవాలు తెలుస్తాయి. శ్రీవారి భక్తులలో ఉండే అనుమాలు పూర్తిగా తొలిగిపోతాయి. కల్తీ జరగలేదని తేలితే శ్రీవారి ప్రసాదాలపై దుష్ప్రచారం చేసి, భక్తులను తప్పుదోవ పట్టించిన వారికి కఠిన శిక్ష విధించాలి. కల్తీ జరిగినట్లు తేలితే నిందితులను వదలకూడదు. ఈ ఘటనలపై ఉద్యోగులు నోరు విప్పి నిజానిజాలను భక్తులకు తెలియజేయాలి.

– పరమేశ్వర్‌రావు, ప్రైవేట్ ఉద్యోగి, తిరుపతి

కేంద్రం జోక్యం అవసరం



కేంద్ర ప్రభుత్వం వెంటనే నెయ్యి స్వచ్ఛత విషయంలో ప్రత్యేక కమిటీని ఏర్పాటు చేసి పరీక్షలు చేయాలి. 2019కి ముందు ఎలాంటి పరీక్షలు చేశారో భక్తులకు వివరించాల్సిన అవసరం ఉంది. అప్పటి పరీక్షల విధానాన్నే గత పాలకులు క్రమం తప్పకుండా చేస్తున్నారు. కానీ ఇప్పుడు రాజకీయ దురుద్దేశమే అజెండాగా శ్రీవారి భక్తులతో ఆడుకుంటున్నారు. కలియుగ దైవంతో పరాచికాలాడే వ్యక్తులు బాగుపడిన దాఖలాలు చరిత్రలో లేవు.

– ఈశ్వర్‌రెడ్డి, ప్రైవేట్ పాలకేంద్రం మాజీ యజమాని, తిరుపతి

ఎలా అర్థం చేసుకోవాలి



ప్రసాదాలకు ఉపయోగించే నెయ్యి స్వచ్ఛతపై గతంలో ఒకలాగా ఆదివారం ప్రెస్ మీట్‌లో మరోలాగా ఈఓ శ్యామలరావు మాట్లాడారు. మీడియా సందేహాలపై సమాధానం చెప్పకుండా మిన్నుకుండిపోయారు. దీన్ని ఎలా అర్థం చేసుకోవాలి. ఇప్పటికే చాలా మంది భక్తులు మనోభావాలు దెబ్బతిని లడ్డూలపై ఆసక్తి సన్నగిల్లేలా కొందరు ప్రవర్తించారు. ఇది చాలా ప్రమాదకరం. నిజాలు బయట పడాలంటే సిట్టింగ్ జడ్జి విచారణ అవసరం.

– శ్రీలక్ష్మి, గృహిణి, తిరుపతి

కమాండ్ కంట్రోల్ సెంటర్‌పై సమీక్ష



సమీక్షిస్తున్న స్మార్ట్ సిటీ అధికారులు

తిరుపతి తుడా: ఇంటిగ్రేటెడ్ కమాండ్ కంట్రోల్ సెంటర్ పనుల పురోగతిపై కలెక్టర్ వెంకటేశ్వర్ మంగళవారం సమీక్షించారు. స్మార్ట్ సిటీ ఎండీ మౌర్య అధ్యక్షతన నిర్వహించిన మాన్యువల్ జనరల్ బాడీ మీటింగ్‌లో ఆన్‌లైన్ ద్వారా స్మార్ట్ సిటీ చైర్మన్,కలెక్టర్ వెంకటేశ్వర్, డైరెక్టర్లు ఎస్పీ సుబ్బరాయుడు, డాక్టర్ రమాశ్రీ పాల్గొన్నారు. కలెక్టర్ మాట్లాడుతూ తిరుపతి నగరంలో స్మార్ట్ సిటీ ప్రాజెక్ట్ లో భాగంగా ఏర్పాటు చేయనున్న కమాండ్ కంట్రోల్ సెంటర్ పనులను వేగవంతం చేయాలని ఆదేశించారు. ఈ క్రమంలోనే వార్షిక బడ్జెట్‌పై చర్చించారు. స్మార్ట్ సిటీ డైరెక్టర్ రామచంద్రారెడ్డి, కార్పొరేషన్ అదనపు కమిషనర్ చరణ్ తేజ్ రెడ్డి, ఎస్ఈ మోహన్, స్మార్ట్ సిటీ జీఎం చంద్రమౌళి, ఎగ్జామినర్ ఆఫ్ అకౌంట్స్ రామచంద్రారెడ్డి, ఎంఈ చంద్రశేఖర్, ఏఈ కామ్ ప్రతినిధి బాలాజీ పాల్గొన్నారు.

'క్రిస్ సిటీ'తో వేలాది ఉద్యోగాలు

చిల్లకూరు : తీర ప్రాంతంలో ఏర్పాటు చేయనున్న క్రిస్ సిటీ ద్వారా వేలాది మంది స్థానికులకు ఉద్యోగ ఉపాధి అవకాశాలు లభిస్తాయని కలెక్టర్ వెంకటేశ్వర్ తెలిపారు. మంగళవారం మండలంలోని ఏరూరు గ్రామంలో న్విహించిన ఇది మంచి ప్రభుత్వం కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. కలెక్టర్ మాట్లాడుతూ ప్రభుత్వం చేసిన మంచి పనులను సచివాలయ సిబ్బంది ప్రతి ఇంటికీ వెళ్లి తెలియజేయాలని సూచించారు. ఈ సందర్భంగా గ్రామంలోని సమస్యలను ఆయన దృష్టికి తీసుకువచ్చారు. ఆ మేరకు స్పందించిన కలెక్టర్ వెంటనే గ్రామంలో వీధి దీపాలు ఏర్పాటు చేయాలని ఆదేశించారు. జలజీవన్ మిషన్ కింద ఓవర్ హెడ్ ట్యాంకు నిర్మించి ప్రతి ఇంటికీ తాగునీరు అందించాలని కోరారు. స్థానికుల ఇళ్ల నిర్మాణాలకు ఎలాంటి ఇబ్బంది లేకుండా చర్యలు చేపట్టాలని చెప్పారు. అనంతరం పొలం పిలుస్తోంది వాల్ పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ క్రమంలోనే రైతులకు డ్రిప్ పరికరాలు పంపిణీ చేయాలని ఆదేశించారు. ఎమ్మెల్యే పాశం సునీల్‌కుమార్ మాట్లాడుతూ వంద రోజుల పాలనలో ప్రభుత్వం చేసిన మంచిని వివరించారు. ఈ సందర్భంగా అంగన్‌వాడీ కేంద్రంలో నిర్వహించిన సామూహిక సీమంతాల్లో కలెక్టర్, ఎమ్మెల్యే పాల్గొన్నారు. కార్యక్రమంలో గూడూరు సబ్ కలెక్టర్ రాఘవేంద్రమీనా ఉన్నారు.



పొలం పిలుస్తోంది పోస్టర్ ఆవిష్కరిస్తున్న కలెక్టర్, ఎమ్మెల్యే తదితరులు





అమ్మవారి ఆలయ ఆర్చికి విద్యుద్దీపాలు (ఇన్‌సెట్) విశేషాలంకరణలో పోలేరమ్మతల్లి

జన జాతరకు వేళాయె!

- విద్యుద్దీప కాంతుల్లో వెంకటగిరి
- పోలేరమ్మ జాతరకు సర్వం సిద్ధం
- రాష్ట్ర పండుగకు భారీ ఏర్పాట్లు
- నేటి నుంచి పోటెత్తనున్న భక్తులు

సైదాపురం/వెంకటగిరి రూరల్ : వెంకటగిరిలో పండుగ వాతావరణం ఏర్పడింది. పోలేరమ్మ

వెంకటగిరి పట్టణం దేదీప్యంగా వెలుగొందుతోంది.. విద్యుద్దీప కాంతుల్లో శోభాయమానంగా అలరారుతోంది. జన జాతరకు పోలేరమ్మ ఆలయం కనులపండువగా ముస్తాబైంది. అమ్మవారి సేవకు అశేష భక్త వాహిని తరలివస్తోంది. బుధవారం రాత్రి నగరోత్సవంలో పాలుపంచుకునేందుకు ఉత్సాహంగా ఎదురుచూస్తోంది. ప్రత్యేక రథంపై కొలువుదీరనున్న అమ్మలగన్న అమ్మను కనులారా వీక్షించేందుకు ఉవ్విళ్లూరుతోంది. బంధుమిత్ర సపరివార సమేతంగా సంబరంలో పాల్గొనేందుకు సన్నద్ధమవుతోంది. ఈ మేరకు జన జాతర ఏర్పాట్లను జిల్లా యంత్రాంగం పకడ్బందీగా చేపట్టింది. రాష్ట్ర పండుగ హోదాకు అనుగుణంగా సన్నాహాలు పూర్తి చేసింది.

జాతర సందర్భంగా ఆర్చి వద్ద నుంచి అమ్మవారి గుడి వరకు విశేషంగా అలంకరించారు. బుధ,గురువారాల్లో అత్యంత వైభవంగా జరిగే జన జాతరకు సన్నాహాలు పూర్తి చేశారు. ఈ క్రమంలో పోలేరమ్మతల్లి బుధవారం రాత్రి జీనుగుల వారి వీధి నుంచి ప్రత్యేక రథంపై నగరోత్సవంగా అమ్మవారి ఆలయం వద్ద కొలువుదీరనున్నారు. అనంతరం భక్తులకు దర్శనమివ్వనున్నారు. రాష్ట్ర పండుగ హోదాలో వైభవంగా నిర్వహించే పోలేరమ్మతల్లి జాతరను అంగరంగ వైభవంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేశారు. ఈ క్రమంలో కలెక్టర్ వెంకటేశ్వరన్, ఎస్పీ సుబ్బరాయుడు, సబ్ కలెక్టర్ రాఘవేంద్రమీన, ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణ, ఆలయ ఈఓ శ్రీనివాసులరెడ్డి, పోలేరమ్మతల్లి పాలకమండలి సభ్యులు ప్రత్యేక ఏర్పాట్లను పర్యవేక్షిస్తున్నారు. ఆదివారం ఆరంభమైన జాతర ఘటోత్సవం నుంచి 5 రోజుల పాటు ప్రతి రోజూ సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. జగన్నాథపురం వారిచే కాంతార బృందం నాట్య ప్రదర్శన, వరంగల్ బోనాల కోలాటం, డ్రమ్స్ వాయిద్యాలు, క్రాకర్స్ వేడుకలు, డీజే ఆకట్టుకుంటున్నాయి.

పుట్టింటి నుంచి మెట్టినింటికి..

కుమ్మరింటి ఆడపడుచుగా పోలేరమ్మతల్లిని భావిస్తారు. బుధవారం ఈ మేరకు కుమ్మరులు పుట్ట మట్టిను తీసుకొచ్చి అమ్మవారి ప్రతిమ తయారు చేస్తారు. అనంతరం కుమ్మరివారింటనే మొదటిపూజ నిర్వహిస్తారు. అమ్మవారికి కళ్లు, దిష్టి చుక్క పెట్టకుండా ఆదేరోజు రాత్రి 7 నుంచి రాత్రి 10.30 గంటల వరకు భక్తుల దర్శనార్థం కొలువు దీర్చుతారు. ఆ సమయంలో అమ్మవారి దర్శన భాగ్యాన్ని భక్తులకు కల్పించనున్నారు. అనంతరం కాంపాళెంలోని గాలిగంగుల వద్ద తొలుత పూజలు చేసి అమ్మవారిని కుమ్మరింట నుండి మెట్టినిల్లు అయిన జీనుగుల వారి వీధికి తీసుకెళతారు. అక్కడ రజకులు పోలేరమ్మతల్లికి ప్రత్యేక పూజలు చేసి మెట్టింటికి ఆహ్వానం పలుకుతారు. ప్రతిమకు కళ్లు, దిష్టిచుక్క పెట్టి, బంగారు ఆభరణాలతో అలంకరిస్తారు. అనంతరం ప్రత్యేకంగా తీర్చిదిద్దిన రథంపై అమ్మవారి ఆశీనులు చేసి భక్త జన సందోహం నడుమ ఊరేగింపుగా ఆలయం (నిలుపు స్థలం) వద్దకు తీసుకువస్తారు. ఈ తంతు మొత్తం బుధవారం రాత్రి కొనసాగుతుంది.



క్రాస్‌రోడ్డు వద్ద ఏర్పాటు చేసిన అమ్మవారి విద్యుద్దీపాల కటౌట్



కాంతార వేషధారణలో కళాకారుడి ప్రదర్శన

శ్రీవారి దర్శనానికి 6 గంటలు

తిరుమల: తిరుమలలో మంగళవారం భక్తుల రద్దీ సాధారణంగా ఉంది. క్యూకాంప్లెక్స్‌లో ఒక్క కంపార్ట్‌మెంట్ నిండింది. సోమవారం అర్ధరాత్రి వరకు 65,604 మంది స్వామివారిని దర్శించుకున్నారు. 24,266 మంది భక్తులు తలనీలాలు సమర్పించుకున్నారు. స్వామివారికి కానుకల రూపంలో హుండీలో రూ.3.85 కోట్లు సమర్పించారు. టైంస్లాట్ టిక్కెట్లు కలిగిన భక్తులకు సకాలంలోనే దర్శనమవుతోంది. దర్శన టిక్కెట్లు లేని వారికి 6 గంటల సమయం పడుతోంది. ప్రత్యేక ప్రవేశ దర్శనం టిక్కెట్లు కలిగిన వారు 2 గంటల్లో స్వామిని దర్శించుకోగలుగుతున్నారు. ఇదిలా ఉంటే సర్వదర్శనం టోకెన్లు కలిగిన భక్తులు నిర్దేశించిన సమయానికి క్యూలోనికి వెళ్లాలని టీటీడీ విజ్ఞప్తి చేస్తోంది. కేటాయించిన సమయాన్ని కంటే ముందు వెళ్లిన భక్తులను క్యూలోకి అనుమతించారని తెలియజేస్తోంది.

బ్రహ్మోత్సవాల్లో ఆర్టీసీ సేవలు కీలకం



సూచనలిస్తున్న ఈడీ చెంగల్‌రెడ్డి

తిరుపతి అర్బన్ : తిరుమల శ్రీవారి బ్రహ్మోత్సవాల్లో ఆర్టీసీ సేవలు కీలకమని జిల్లా ప్రజా రవాణా అధికారి, ఈడీ చెంగల్‌రెడ్డి తెలిపారు. మంగళవారం ఆయన అధికారులతో సమావేశం నిర్వహించారు. చెంగల్‌రెడ్డి మాట్లాడుతూ అక్టోబర్ 4వ తేదీ నుంచి బ్రహ్మోత్సవాలు ప్రారంభమవుతున్నాయని, ఆర్టీసీ ఉద్యోగులు సిద్ధంగా ఉండాలని కోరారు. ప్రతి భక్తుడూ ప్రశాంతమైన వాతావరణంలో తిరుపతి నుంచి తిరుమలకు రాకపోకలు సాగించేలా ఏర్పాట్లు చేయాలని కోరారు. ఈ మేరకు డిపో మేనేజర్లు ప్రణాళికలు తయారు చేసుకోవాలని సూచించారు. అనంతరం విజయవాడ నుంచి వచ్చిన ఆర్టీసీ అధికారి జమీర్ బ్రహ్మోత్సవాల్లో బస్‌పాస్ మాడ్యూల్‌పై సిస్టమ్ సూపర్‌వైజర్లకు ప్రత్యేక శిక్షణ ఇచ్చారు. డిప్యూటీ సీటీఎం భాస్కర్ పాల్గొన్నారు.



బంగారం :
24 క్యారెట్లు 10 గ్రాములు రూ.77,140
22 క్యారెట్లు ఒక గ్రాము రూ.7,007
వెండి:
హోల్‌సేల్ ధర (కిలో) రూ.91,000
రిటైల్ వెండి గ్రాము రూ.93.00

క్లుప్తంగా

తిరుమలలో గుర్తుతెలియని వ్యక్తి మృతి




తిరుపతి క్రైమ్: తిరుమల అశ్విని ఆస్పత్రిలో చికిత్స పొందుతూ గుర్తు తెలియని ఈనెల 19వ తేదీన మృతి చెందాడు. తిరుమల వన్ టౌన్ సీఐ విజయ్‌కుమార్ తెలిపిన వివరాల మేరకు.. తిరుమలలోని రాంబగీచా సమీపంలోని వినాయకుడి గుడి వద్ద ఓ వ్యక్తి కిందపడి ఉండగా గమనించి ఆస్పత్రికి తరలించారు. అయితే ఆ వ్యక్తి అప్పటికే బ్రెయిన్ స్ట్రోక్‌తో మృతి చెందినట్లుగా అశ్విని ఆస్పత్రిలో వైద్యులు నిర్ధారించారు. అతని వద్ద ఉన్న ఆధారాల మేరకు అతని పేరు దూదేకుల సిద్దయ్య అని, వైఎస్సార్ జిల్లాలోని బ్రహ్మంగారి మఠం అతని సొంత ఊరని భావించి అక్కడికి వెళ్లి విచారించారు. అయితే ఆ ఊరిలో అతనికి చెందిన వారు ఎవరూ లేరు. అతను 10 సంవత్సరాలుగా తిరుమలలోనే తాపీ మేస్త్రీ పనులు చేస్తున్నట్లుగా తెలుసుకున్నారు. అతని వివరాలు తెలిసిన వారు తిరుమల వన్ టౌన్ పోలీసులను సంప్రదించాలని సీఐ విజయ్‌కుమార్ కోరారు.

అత్తను చంపిన అల్లుడు


ఘటనాస్థలం పరిశీలిస్తున్న పోలీసులు

గూడూరురూరల్ : పట్టణంలోని చెన్నూరు బీసీ కాలనీలో అత్తను అల్లుడే చంపేశాడు. వివరాలు.. పచ్చికాల ఆనందమ్మ (42) వరసకు అల్లుడైన పాలేపు రమేష్‌తో సహజీవనం చేస్తోంది. ఇటీవల ఇరువురి మధ్య మనస్పర్థలు తలెత్తాయి. ఈ క్రమంలో మంగళవారం వేకువ జామున ఆనందమ్మ నిద్రిస్తుండగా రమేష్ కర్రతో ఆమె తలపై గట్టిగా కొట్టి హత్య చేశాడు. స్థానిక సమాచారం మేరకు రూరల్ సీఐ కిషోర్‌బాబు, ఎస్‌ఐ మనోజ్‌కుమార్ ఘటనా స్థలానికి చేరుకుని వివరాలు సేకరించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం గూడూరు ఏరియా ఆస్పత్రికి తరలించారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

అంతరిక్ష పరిశోధనల్లో అగ్రగణ్యుడు


షార్‌లో అప్పటి ప్రధాని ఇందిరాగాంధీతో సతీష్‌ధవన్ (ఫైల్)


నాటి ప్రధాని వాజ్‌పేయితో(ఫైల్)


ప్రొఫెసర్ సతీష్ ధవన్

భారత అంతరిక్ష పరిశోధనల్లో సతీష్ ధవన్ ప్రస్థానం ఓ చరిత్ర. వేతనంగా ఒక్క రూపాయి తీసుకుని విశేష సేవలందించారు. తప్పటడుగులు వేస్తున్న సాంకేతికతను భారీ రాకెట్లు తయారు చేసే స్థాయికి పరుగులు తీయించారు. రోదసీలోకి ఉపగ్రహాలను ప్రవేశపెట్టే శక్తిసామర్థ్యాలను దేశానికి అందించారు. సమాచార వ్యవస్థలో విప్లవాత్మకమైన మార్పులకు శ్రీకారం చుట్టారు. టెలివిజన్ ద్వారా తొలిసారిగా దూర విద్యా వసతిని కల్పించారు. అప్పట్లో ఆయన వేసిన పునాదులతో నేటి శాస్త్రవేత్తలు నూతన ఒరవడిని సృష్టిస్తున్నారు. అటు వైమానిక రంగం అభివృద్ధికి ఇటు అంతరిక్ష పరిశోధన ప్రగతికి సతీష్ ధవన్ విశేషంగా కృషి చేశారు. చిరస్మరణీయ సేవలకు గుర్తుగా శ్రీహరి కోట రాకెట్ కేంద్రానికి సతీష్ ధవన్ స్పేస్ సెంటర్ (షార్) అని నామకరణం చేశారు. ఇస్రోకు ఆయన అందించిన సేవలను గుర్తు చేసుకుంటూ బుధవారం సతీష్ ధవన్ జయంతి సందర్భంగా ఈ కథనం..

- పీఎస్‌ఎల్‌వీకి ఆద్యుడు ప్రొఫెసర్ సతీష్ ధవన్
- రూపాయి జీతంతో శాస్త్రవేత్తగా సేవలు
- రాకెట్ ప్రయోగాల్లో విప్లవాత్మక మార్పులకు ఆద్యుడు
- ఆయన అవిరళ కృషి కారణంగానే నేటి ఫలితాలు

సూళ్లూరుపేట : భారత అంతరిక్ష ప్రయోగాల్లో ప్రొఫెసర్ సతీష్ ధవన్‌ది సువర్ణ అధ్యాయం. ఎందుకుంటే ఆయన నెలకు ఒక్క రూపాయి జీతం తీసుకుని ఇస్రోలో పనిచేసి ఈ దేశానికి ఉపగ్రహాల సాంకేతిక పరిజ్ఞానాన్ని తీసుకొచ్చిన వారిలో అగ్రగణ్యులు. ఇస్రో తొలినాళ్లలో చిన్న తరహా రాకెట్ ప్రయోగాలకు పరిమితమైంది. భవిష్యత్‌లో పెద్ద పెద్ద ఉపగ్రహాలను రోదసీలోకి ప్రవేశపెట్టి దేశ ప్రజలకు అత్యంత అధునాతన సాంకేతిక పరిజ్ఞానాన్ని అందించాలని ఆయన అనుక్షణం పరితపించే వారు. భారత తొలి అంతరిక్ష పితామహుడు విక్రమ్‌సారాభాయ్ అయితే, ఆయన కన్న కలలను సాకారం చేసింది మాత్రం ప్రొఫెసర్ సతీష ధవన్. భారీ రాకెట్‌లు, ఉపగ్రహాలు తయారు చేసుకుని గ్రహాంతర ప్రయోగాలే చేసే స్థాయికి ఎగిగి నేడు ప్రపంచంలో రెండు మూడు స్థానాల్లో ఉన్నామంటే అందులో సతీష్ ధవన్ వేసిన పునాదులే కారణం. 1975 ఆగస్టు 1 నుంచి 1976 జులై 31 వరకు ప్రయోగించిన సమాచార ఉపగ్రహాలతో ఆరు రాష్ట్రాల్లో 2,400 గ్రామాలను అనుసంధానించి టెలివిజన్ ద్వారా దూరవిద్యా సదుపాయాన్ని (టెలీ ఎడ్యుకేషన్) ఆనాడే కల్పించగలిగారు. ఈ అనుభవం భారత జాతీయ సమాచార ఉపగ్రహ వ్యవస్థకు ఎంతో దోహదపడి సమాచార రంగంలో విప్లవాత్మకమైన మార్పులకు కారణమైంది. ఆనాడు సతీష్ ధవన్ వైమానిక శాస్త్రవేత్తగా అటు వైమానిక శాస్త్రరంగానికి, ఇటు అంతరిక్ష పరిశోధనా ప్రగతికి ఎనలేని సేవలందించారు. ఆయన ఆలోచనల్లో నుంచి పుట్టినవే పీఎస్‌ఎల్‌వీ, జీఎస్‌ఎల్‌వీ రాకెట్‌లు. ఈ రెండు రాకెట్లను తయారు చేయడానికి ఆయన ఆధ్వర్యంలో ఎన్నో పరీక్షలు చేసి విజయాలు సాధించారు. నేడు పీఎస్‌ఎల్‌వీ రాకెట్ ప్రపంచవ్యాప్తంగా ఖ్యాతి చెందిందంటే అది ప్రొఫెసర్ సతీష్ ధవన్ చేసిన కృషి ఫలితమేనని సగర్వంగా చెప్పవచ్చు.

వరించిన అవార్డులు

1981లో పద్మవిభూషణ్ అవార్డు, ఇందిరాగాంధీ అవార్డు రెండు సార్లు, ఇండియన్ ఇనిస్టిట్యూట్ సైన్స్ అవార్డు, కాలిఫోర్నియా ఇనిస్టిట్యూట్ టెక్నాలజీ వారు ఇచ్చిన అవార్డులను ఆయన పొందారు. ఆయన హయాంలో ఇందిరాగాంధీ, ఐకే గుజ్రాల్, అటల్ బిహారీ వాజ్‌పాయ్ ప్రధానమంత్రులుగా షార్‌కు విచ్చేసి ప్రయోగాలను వీక్షించారు. ఇండియన్ మిసైల్ మ్యాన్, భారత మాజీ రాష్ట్రపతి ఏపీజే అబ్దుల్‌కలాం కూడా ఆయన ఆధ్వర్యంలో ఇస్రో తొలి ప్రయోగానికి ప్రాజెక్ట్ డైరెక్టర్‌గా వ్యవహరించారు.

మహనీయుని చరిత్ర ఇదీ..

శ్రీనగర్‌లో 1920 సెప్టెంబర్ 25న సతీష్ ధవన్ జన్మించారు. విద్యార్థిగా అత్యంత ప్రజ్ఞాపాటవాలను ప్రదర్శించి గణితం, భౌతికశాస్త్రంలో బీఏ వరకు చదివారు. అనంతరం ఎంఏలో ఇంగ్లీష్ లిటరేచర్ చేశారు. తర్వాత మెకానికల్ ఇంజినీరింగ్‌లో పట్టభద్రులై, ఉన్నత విద్య కోసం విదేశాలకు వెళ్లి కాలిఫోర్నియా ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ నుంచి వైమానిక శాస్త్రంలో, గణితంలో పీహెచ్‌డీ చేసి డాక్టరేట్ పొందారు.1951లో స్వదేశానికి విచ్చేసిన వెంటనే బెంగళూరులోని ఇండియన్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ సైన్సెస్‌లో అధ్యాపకుడిగా చేరారు. అనతి కాలంలోనే ఆచార్య పదోన్నతి పొందారు. 1962లో ఆ సంస్థకు డైరెక్టర్ అయ్యారు. 1972లో అంతరిక్ష పితామహుడు డాక్టర్ విక్రమ్ సారాభాయ్ మరణానంతరం ఇస్రోను ముందుకు నడపగలిగిన వ్యక్తిగా ఆనాటి ప్రధానమంత్రి ఇందిరాగాంధీ ఆ బాధ్యతలను ధవన్‌కు అప్పగించారు. బెంగళూరు ఐఐటీకి డైరెక్టర్‌గా కొనసాగుతూనే ఇస్రో చైర్మన్ బాధ్యతలు నిర్వహిస్తూ నెలకు ఒక్క రూపాయి జీతంగా తీసుకున్న గొప్పవ్యక్తిగా ఆయన గురించి ఈనాటికి చెప్పుకోవడం విశేషం. సమాచార వ్యవస్థ, వాతావరణ పరిశోధన, భూమిలోని ఖనిజసంపద ఉనికిని తెలుసుకోవడం కోసం బహుళ ప్రయోజనాలకై సొంతంగా ఉపగ్రహాలను తయారుచేసి ప్రయోగించాలనే డాక్టర్ విక్రమ్ సారాభాయ్ కన్నకలలను ధవన్ నిజం చేశారు. ఇస్రో చైర్మన్ అయిన అనతికాలంలోనే ఆర్యభట్ట, భాస్కర, యాపిల్ ఉపగ్రహాలను నిర్మించి ఎస్‌ఎల్‌వీ ఉపగ్రహ వాహకనౌక ద్వారా ప్రయోగించ గలిగారు. ఇన్‌శాట్, ఐఆర్‌ఎస్, తరహ ఉపగ్రహాల నిర్మాణ ప్రణాళికలు తయారు చేశారు. భారత అంతరిక్ష పరిశోధనా యాత్రలో ఆయన శకం ముఖ్యమైన మైలురాళ్లుగా చెప్పుకోవచ్చు. వయోభారంతో ఉద్యోగ విరమణ చేసిన తర్వాత కూడా ఆయన అంతరిక్ష రంగానికి విశేష సేవలు అందించారు. ఆ మహానుభావుడి పేరును మరిచి పోకుండా శ్రీహరికోట రాకెట్‌కేంద్రానికి 2002 సెప్టెంబర్ 5న ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా సతీష్ ధవన్ స్పేస్ సెంటర్‌గా నామకరణం చేసి ఇస్రో ఘనమైన నివాళిని ఆయనకు సమర్పించింది. షార్‌లోని రెండోగేటుకు అవతల వైపున సతీష్‌ధవన్ విగ్రహాన్ని ఏర్పాటుచేసి దానికి సతీష్ ధవన్ మెమోరియల్‌గా నామకరణం చేసి ఆయన పట్ల భక్తిభావాన్ని చాటుకుంది.

సముద్రంలో 'అల'జడి

వాకాడు : అల్పపీడనం ప్రభావంతో మంగళవారం మండలంలోని తూపిలిపాళెం వద్ద సముద్రంలో అలలు ఉవ్వెత్తున ఎగసిపడుతున్నాయి. సుమారు 5 మీటర్లు వరకు సముద్రం ముందు చొచ్చుకు రావడంతో తీరప్రాంవాసులు ఆందోళన చెందుతున్నారు. తుపాను, వాయుగుండం ప్రభావంతో రెండు నెలలుగా వేట లేక గంగపుత్రులు తీవ్రంగా ఇబ్బంది పడుతున్నారు. మళ్లీ సముద్రంలో అలజడి రేగడంతో తీరానికే పరిమితం కావాల్సి వస్తోందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వం సైతం వేట విరామ సమయంలో ఇవ్వాల్సిన రూ.20వేల భృతిని చెల్లించకపోవడంతో దిక్కుతోచక కొట్టుమిట్టాడుతున్నారు. గత ఏడాదితో పోలిస్తే ప్రస్తుతం తమ బతుకు దుర్భరంగా మారిందని వాపోతున్నారు. వేట సక్రమంగా సాగక ఈ ఏడాది ఇప్పటికే దాదాపు 15వేల టన్నుల మత్స్య సంపదను పోగొట్టుకున్నామని వెల్లడిస్తున్నారు.

నామినేటెడ్ పదవుల్లో పలువురికి చోటు

చిత్తూరు అర్బన్: రాష్ట్ర ప్రభుత్వం భర్తీ చేసిన నామినేటెడ్ పోస్టుల్లో చిత్తూరు, తిరుపతి జిల్లాల నుంచి పలువురు టీడీపీ నేతలకు చోటు లభించింది. ఇదే సమయంలో జిల్లాలో బీజేపీ, జనసేన పార్టీలకు చెందిన నాయకులకు ఈ జాబితాలో స్థానం దక్కలేదు. తిరుపతికి చెందిన ఎ.రవినాయుడును స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ (శాప్) చైర్మన్‌గా, కుప్పానికి చెందిన మునిరత్నంను ఏపీఎస్‌ఆర్టీసీ వైస్ చైర్మన్‌గా, చిత్తూరుకు చెందిన మాజీ మేయర్ కటారి హేమలతను ఏపీ టూరిజం డెవలప్‌మెంట్ కార్పొరేషన్ సభ్యురాలిగా, ఏపీ అర్బన్ ఫైనాన్స్ అండ్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ కార్పొరేషన్ సభ్యుడిగా వూకా విజయకుమార్, ఏపీ పద్మశాలి సంక్షేమ అభివృద్ధి కార్పొరేషన్ సభ్యుడిగా నగరికి చెందిన గంజి మాధవయ్యను నియమిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీచేసింది.

యువతి అదృశ్యంపై ఫిర్యాదు

ఏర్పేడు:మండలంలోని ఎండీపుత్తూరులో యువతి(20) అదృశ్యంపై మంగళవారం ఫిర్యాదు అందినట్లు సీఐ జయచంద్ర తెలిపారు. వివరాలు.. మండలంలోని గ్రామానికి చెందిన ఓ కుటుంబం వ్యవసాయ కూలీలుగా జీవనం సాగిస్తున్నారు. మంగళవారం కూలి పనులకు వెళ్లి తిరిగి ఇంటికి రాగా వారి కుమార్తె కనబడలేదు. బంధువుల ఇళ్ల తదితర ప్రాంతాల్లో వెతికినా కనబడకపోవడంతో యువతి తల్లిదండ్రులు పోలీసులను ఆశ్రయించారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ వెల్లడించారు.

ప్రాధాన్యత రంగాలకు రుణాలు


బ్యాంకర్ల సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీ గురుమూర్తి

తిరుపతి అర్బన్ : జిల్లాలో ప్రాధాన్యత రంగాలకు లక్ష్యం మేర బ్యాంక్ రుణాలు మంజూరు చేయాలని ఎంపీ గురుమూర్తి ఆదేశించారు. మంగళవారం కలెక్టరేట్‌లో బ్యాంకర్లతో జిల్లా స్థాయి రివ్యూ మీటింగ్ నిర్వహించారు. ఎంపీ మాట్లాడుతూ 2024–25 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి వ్యవసాయం, విద్య, ఎంఎస్‌ఎంఈ తదితర కేటగిరీల్లో బ్యాంకర్లు గడువులోపు రుణాలు అందించాలని సూచించారు. ముఖ్యంగా బడుగు బలహీన వర్గాలకు ప్రైవేటుగా అప్పులు తెచ్చుకునే స్తోమత ఉండదని, కేవలం బ్యాంక్ రుణాల ఆధారంగానే జీవనం సాగించాల్సి ఉంటుందని తెలిపారు. సరైన డాక్యుమెంట్లు లేకపోయినా, వారికి అర్థమయ్యేలా వివరించి, సంబందిత పత్రాలను తెప్పించుకుని రుణాలు అందించాలని కోరారు. జేసీ శుభం బన్సల్ మాట్లాడుతూ రుణాల మంజూరులో బ్యాంకర్లు జాప్యం చేయకూడదని స్పష్టం చేశారు. సమావేశంలో లీడ్ బ్యాంక్ మేనేజర్ విశ్వనాథరెడ్డి, ఆర్‌బీఐ ఎల్‌డీఓ పూర్ణిమ, యూనియన్ బ్యాంక్ రీజనల్ మేనేజర్ రామ్‌ప్రసాద్, నాబార్డ్ డీడీఎం సునీల్, డీఆర్‌డీఏ పీడీ ప్రభావతి, జిల్లా సాంఘిక సంక్షేమ శాఖ అధికారి చెన్నయ్య, మెప్మా పీడీ రాధమ్మ పాల్గొన్నారు.

బాధ్యతగా ప్రజా సమస్యలపై పోరాటం


పెద్దిరెడ్డికి పుష్పగుచ్ఛం అందిస్తున్న వైఎస్సార్‌సీపీ నేతలు

వరదయ్యపాళెం: ప్రజా సమస్యలపై బాధ్యతగా ఎప్పటికప్పుడు పోరాటం సాగించాలని మాజీ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి స్పష్టం. మంగళవారం తిరుపతిలో ఆయన స్వగృహంలో వైఎస్సార్‌సీపీ సత్యవేడు నియోజకవర్గ సమన్వయకర్త నూకతోటి రాజేష్, ఇతర నేతలు మర్యాదపూర్వకంగా కలిశారు. వైఎస్సార్‌సీపీ చిత్తూరు జిల్లా అధ్యక్షుడిగా, పీఏసీ కమిటీ సభ్యుడిగా నియమితులైనందుకు మాజీ మంత్రి పెద్దిరెడ్డికి అభినందనలు తెలిపారు. పెద్దిరెడ్డి మాట్లాడుతూ ప్రజా సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకురావాల్సిన బాధ్యత మనపై ఉందన్నారు. నేతలు, కార్యకర్తలు సమన్వయంతో సమష్టిగా ముందుకు సాగాలని సూచించారు. కార్యక్రమంలో పార్టీ జిల్లా కార్మిక విభాగం అధ్యక్షుడు బీరేంద్ర వర్మ, నాయకులు భానుప్రకాష్ రెడ్డి, మండల పార్టీ కన్వీనర్ నాయుడు దయాకర్‌రెడ్డి, జేసీఎస్ కన్వీనర్ చిన్నా, దామోదర్‌రెడ్డి, సింగిల్ విండో మాజీ చైర్మన్ హరిబాబురెడ్డి, దేవాంగ కార్పొరేషన్ మాజీ డైరెక్టర్ తిలక్‌బాబు, పార్టీ జిల్లా కార్యవర్గ సభ్యుడు బందిల సురేష్, మండల సర్పంచుల సంఘం అధ్యక్షుడు చంద్రారెడ్డి, యూత్ కన్వీనర్ వినోద్ యాదవ్, శ్రీకాళహస్తి ట్రస్టు బోర్డు మాజీ సభ్యుడు పెద్దిరెడ్డి మల్లికార్జునరెడ్డి, నాయకులు దుడ్డు వేణు, రమణయ్య, నానిరెడ్డి, విజయ్ రెడ్డి పాల్గొన్నారు.

ఎస్వీయూలో జాతీయ సదస్సు


జ్యోతి ప్రజ్వలనతో సదస్సు ప్రారంభిస్తున్న అతిథులు

తిరుపతి సిటీ: ఎస్వీయూ హిందీ విభాగం ఆధ్వర్యంలో మంగళవారం' ఈ శిక్షా నీతి మెం హిందీకి స్థితి' అనే అంశంపై జాతీయ సదస్సు నిర్వహించారు. హిందీ విభాగాధిపతి ప్రొఫెసర్ నారాయణ అధ్యక్షతన జరిగిన ఈ సదస్సుకు పలువురు ప్రముఖులు హాజరై జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. నూతన విద్యావిధానంలో హిందీ పాత్రపై చర్చించారు. అనంతరం హిందీ సప్తాహ సందర్భంగా విద్యార్థులకు పోటీలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపల్ పద్మనాభం, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

30 వరకు వీడియో, రీల్స్ పోటీలకు గడువు

తిరుపతి అర్బన్ : ప్రపంచ పర్యాటక దినోత్సవాన్ని పురస్కరించుకుని టూరిజం అధికారులు వీడియో, రీల్స్ పోటీలకు దరఖాస్తు చేసుకునేందుకు ఈ నెల 30వ తేదీ వరకు గడువు పొడిగించినట్లు కలెక్టర్ వెంకటేశ్వర్ తెలిపారు. మంగళవారం ఆయన మాట్లాడుతూ జిల్లాలోని ఆలయాలు, పర్యాటక ప్రాంతాలపై 3 నిముషాల నిడివితో వీడియో, మూడు నిముషాల రీల్స్‌ను పోటీలకు పంపించాల్సి ఉంటుందన్నారు. విజేతలకు ప్రథమ బహుమతిగా రూ.లక్ష, రెండో బహుమతిగా రూ.50వేలు, మూడో బహుమతిగా రూ.25వేలు అందించనున్నట్లు వివరించారు. వీడియోలు, రీల్స్‌ను edtpt@aptdc.in వెబ్‌సైట్, లేదా కలెక్టర్‌కు మెయిల్ చేయాలన్నారు. వివరాలకు 6309942027, 9848823086, 9705933311 నంబర్లలో సంప్రదించాలని సూచించారు.

విద్యార్థి ఆత్మహత్యాయత్నం

తిరుపతి ఎడ్యుకేషన్ : ఓ హాస్టల్లో మంగళవారం ఇంటర్ విద్యార్థి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. వివరాల్లోకి వెళితే.. తిరుపతి సమీపంలోని దుర్గసముద్రం వద్ద ఉన్న ఓ ప్రైవేటు జూనియర్ కళాశాల బాలుర హాస్టల్‌లో ఇంటర్ విద్యార్థి తన గదిలో ఫ్యానుకు ఉరేసుకోబోయాడు. ఆ సమయంలో ఆ విద్యార్థికి ఫిట్స్ రావడంతో పక్కనే ఉన్న విద్యార్థులు గుర్తించి కళాశాల సిబ్బందికి సమాచారం అందించారు. వెంటనే సిబ్బంది ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డ విద్యార్థిని స్విమ్స్‌కు తరలించి చికిత్స అందించారు. ప్రస్తుతం ఆ విద్యార్థి ఆరోగ్య పరిస్థితి నిలకడగా ఉన్నట్టు తెలిసింది.

శ్రీసిటీలో ట్రిపుల్ ఐటీ విద్యార్థుల 2కే రన్


2కే రన్‌కు హాజరైన విద్యార్థులు

శ్రీసిటీ (వరదయ్యపాళెం): శ్రీసిటీలోని ట్రిపుల్ ఐటీ విద్యార్థులు మంగళవారం డీఎస్పీ పైడేశ్వరరావు ఆధ్వర్యంలో 2కే రన్ నిర్వహించారు. పైడేశ్వరరావు మాట్లాడుతూ.. తిరుపతి జిల్లా ఎస్పీ ఆదేశాల మేరకు నిషేధిత మత్తు పదార్థాలు, వాటి వాడకం వల్ల జరిగే నష్టాల గురించి విద్యార్థులకు అవగాహన కలిస్తూ శ్రీసిటీ పారిశ్రామికవాడలోని ప్రధాన రోడ్లపై 2కే రన్ నిర్వహించామన్నారు. ఈ సందర్భంగా ద్విచక్ర వాహనదారులు హెల్మెట్ తప్పనిసరిగా వినియోగించాలని, కారులో ప్రయాణించేవారు సీటు బెల్టు ధరించాలని సూచించినట్టు తెలిపారు. అలాగే పరిసర ప్రాంతాలు శుభ్రతగా ఉంచుకునేందుకు ప్రతి ఒక్కరూ స్వచ్ఛ్ భారత్ వైపు అడుగులు వేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో శ్రీసిటీ సీఐ బీవీ శ్రీనివాసులు, ఎస్‌ఐ హరిప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

ఇద్దరు తహసీల్దార్ల సస్పెన్షన్

తిరుపతి అర్బన్:పుత్తూరులో పెట్రోల్ బంకుకు సంబంధించి అవినీతికి పాల్పడ్డారన్న అంశంపై రెండు రోజుల క్రితం తిరుపతి ఆర్డీవో నిశాంత్ రెడ్డి సస్పెండ్ చేసిన విషయం తెలిసిందే. తాజాగా అప్పటి పుత్తూరు తహసీల్దార్ పరమేశ్వర స్వామి, ప్రస్తుతం అనంతపురం జిల్లా ఆత్మకూరు మండలం తహసీల్దార్‌గా పనిచేస్తున్నారు. ఆయన్ను కూడా సస్పెండ్ చేశారు. అంతేకాకుండా ప్రస్తుతం రేణిగుంట తహసీల్దార్‌గా పనిచేస్తున్న అప్పటి కలెక్టరేట్ సూపరిండెంట్ సురేష్ బాబును కూడా సస్పెండ్ చేశారు. ఆ మేరకు మంగళవారం ల్యాండ్ అడ్మినిస్ట్రేషన్ చీఫ్ కమిషనర్ ఉత్తర్వులు జారీ చేశారు.

ఐటీఐలో ఉద్యోగ మేళా

గూడూరు రూరల్: పట్టణంలోని ప్రభుత్వ ఐటీఐలో గురువారం ఉద్యోగ మేళా నిర్వహిస్తున్నట్లు నైపుణ్యాభివృద్ధి సంస్థ అధికారి లోకనాథం మంగళవారం తెలిపారు. శ్రీసిటీలోని డైకిన్ ఎయిర్ కండిషన్ పరిశ్రమ, గ్రీన్ టెక్ ఇండ్రస్టీస్, అల్ట్రా మెరైన్ పిగ్‌మెంట్, శ్రీరామ్ లైఫ్ ఇన్సూరెన్స్ ప్రతినిధులు ఇంటర్వ్యూలు చేపట్టనున్నట్లు వెల్లడించారు. పది, ఇంటర్, డిగ్రీ పాస్ అయిన వారు అర్హులన్నారు. వివరాలకు 8639835953 నంబర్‌లో సంప్రదించాలని ఆయన సూచించారు.

భక్తులకు అంకితభావంతో సేవలు


సూచనలిస్తున్న టీటీడీ అదనపు ఈఓ వెంకయ్య చౌదరి

తిరుమల: టీటీడీ ఉద్యోగులందరూ భక్తుల్లో వేంకటేశ్వర స్వామిని దర్శిస్తూ వారికి అత్యంత అంకితభావంతో సేవలు అందించాలని టీటీడీ అదనపు ఈవో సీహెచ్ వెంకయ్య చౌదరి పిలుపునిచ్చారు. బ్రహ్మోత్సవాల సందర్భంగా భక్తులకు అందించాల్సిన సేవలపై తిరుమల ఆస్థాన మండపంలో మంగళవారం ఆలయ, వసతి విభాగాల ఉద్యోగులతో ఆయన సమావేశమయ్యారు. ఈ సందర్భంగా అదనపు ఈవో మాట్లాడుతూ ప్రపంచం నలుమూలల నుంచి ప్రతిరోజూ వేలాదిమంది భక్తులు తిరుమల శ్రీవారిని దర్శించుకోవడానికి వస్తుంటారని తెలిపారు. విభిన్న ప్రాంతాలు, భాషలు, సంస్కృతికి చెందిన వ్యక్తులతో సేవాభావంతో వ్యవహరిస్తూ ఉద్యోగులు కీలక పాత్ర పోషించాలని చెప్పారు. యాత్రికులకు మెరుగైన సమాచారం అందించాలని పిలుపునిచ్చారు. అనంతరం అక్టోబరు నెలలో జరగనున్న వార్షిక బ్రహ్మోత్సవాలకు సన్నద్ధం కావాలని ఉద్యోగులను కోరారు. బ్రహ్మోత్సవాలను విజయవంతంగా నిర్వహించేందుకు సమష్టిగా పనిచేయాలని ఆకాంక్షించారు. డిప్యూటీ ఈవోలు లోకనాథం, భాస్కర్, హరీంద్రనాథ్, ఆశాజ్యోతి, చీఫ్ పీఆర్వో డాక్టర్ టీ రవి, ఉద్యోగులు పాల్గొన్నారు.

నేడు ఐసీడీఎస్‌లో పోస్టులకు పరీక్ష

- ఒక్క రోజు ముందు సిలబస్ విడుదల
- అయోమయంలో అభ్యర్థులు


జయలక్ష్మి, ఐసీడీఎస్ ప్రాజెక్టు డైరెక్టర్

తిరుపతి అర్బన్ : ఐసీడీఎస్ పరిధిలోని ఉద్యోగాలు భర్తీకి బుధవారం పరీక్ష నిర్వహించనున్నారు. అయితే ఒక్క రోజు ముందు మంగళవారం పరీక్షకు సంబంధించిన సిలబస్‌ను వైబ్‌సైట్‌లో పెట్టడంపై దరఖాస్తుదారులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. జిల్లా చైల్డ్ ప్రొటెక్షన్ పరిధిలో 9 ఉద్యోగాలు, ఐసీడీఎస్ ప్రాజెక్టు కోఆర్డినేటర్స్‌కు సంబందించి 7 పోస్టులను భర్తీ చేస్తున్నట్లు ఆరు నెలలకు క్రితం వెల్లడించారు. మార్చిలో నోటిఫికేషన్ విడుదల చేశారు. దీంతో 633 మంది దరఖాస్తులు చేసుకున్నారు. వారి సర్టిఫికెట్లు పరిశీలించి విద్యార్హతను బట్టి 210 మందికి చెందిన దరఖాస్తులను మాత్రమే రెండు నెలల క్రితం ఎంపిక చేశారు. అయితే తాజాగా 210 మందికి పరీక్ష నిర్వహించి మెరిట్ ఆధారంగా 16 పోస్టులను భర్తీ చేస్తామని అధికారులు ప్రకటించారు. మంగళవారం కాల్ చేసి బుధవారం ఉదయం 10.30 గంటలకు శ్రీరామ ఇంజినీరింగ్ కళాశాలలో పరీక్ష ఉందని 210 మందికి సమాచారం ఇచ్చారు. ఆన్‌లైన్‌లో ఎన్‌ఐసీ వెబ్‌సైట్‌లో పరీక్షకు సంబంధించిన సిలబస్‌ను కూడా మంగళవారమే పెట్టారు.

రూ.లక్ష కొట్టు.. పోస్టు పట్టు

దరఖాస్తుల పరిశీలన అనంతరం 210 మందిని ఎంపిక చేసిన తర్వాత అభ్యర్థులకు కొత్త బెడద మొదలైంది. ఒక ఉద్యోగానికి రూ.లక్ష ఇస్తే పోస్టు ఇస్తామంటూ 8582959429 నంబర్ నుంచి దరఖాస్తుదారులకు కాల్స్ వచ్చాయి. ఓ వ్యక్తి ఈ మేరకు పలువురు నుంచి నగదు వసూలు చేసినట్లు చర్చ సాగుతోంది. ముందుగా రూ.50వేలు, పోస్టు వచ్చిన తర్వాత మిగిలిన రూ.50వేలు ఇవ్వాలంటూ నమ్మించి భారీగా వసూలు చేసినట్లు తెలుస్తోంది. అయితే దరఖాస్తుదారుల వివరాలు సదరు వ్యక్తికి ఐసీడీఎస్ వారు ఇవ్వకుంటే ఎలా తెలుస్తాయని పలువురు అనుమానం వ్యక్తం చేస్తున్నారు. బేరసారాలు ముగిసిన తర్వాత తూతూమంత్రంగా పరీక్ష నిర్వహించేందుకు సన్నద్ధమయ్యారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. అందులో భాగంగానే పరీక్షకు ఒక్కరోజు ముందు అభ్యర్థులు సమాచారం ఇచ్చారని పలువురు మండిపడుతున్నారు.

> **పారదర్శకంగా పరీక్ష**
>
> 16 పోస్టుల భర్తీకి సంబంధించి పరీక్షను పారదర్శకంగానే నిర్వహిస్తాం. బుధవారం ఉదయం 10.30 గంటలకు తిరుపతి కరకంబాడి రోడ్డులోని శ్రీరామ ఇంజినీరింగ్ కళాశాలలో కంప్యూటర్ ప్రొటక్షన్ టెస్ట్ 11 గంటల వరకు ఉంటుంది. ఆ మేరకు ఎంపిక చేసిన 210 మంది దరఖాస్తుదారులు పరీక్షకు హాజరుకావాలని కోరుతున్నాం. ఉద్యోగాలు ఇప్పిస్తామని దరఖాస్తుదారులకు ఫోన్ చేసి నగదు వసూలు చేస్తున్నట్లు మాకు సమాచారం వచ్చింది. దాంతో మాకు ఎటువంటి సంబందం లేదు. మెరిట్‌లో వచ్చిన వారికే పోస్టు ఇస్తాం.
>
> – జయలక్ష్మి, పీడీ, ఐసీడీఎస్

సాక్షి క్లాసిఫైడ్స్

Education

DIRECT FINAL YEAR
Last Chance: 10th, Inter, Direct Degree (Disc), BA, B.Com, B.Sc, BBA, BCA, BMLT, DMLT, B.Tech, Diploma, MA, M.Com, M.Sc, MBA, MCA Regular/lateral entry 9381287629


Real Estate

PLOTS FOR SALE
నాయుడుపేట బస్టాండ్ నుండి 4 K.M దూరంలో 6 లైన్స్ హైవేకి 2వ బిట్ అయిన తుడా అప్రూవల్ 43 ఎకరాల మెగా వెంచర్‌లో 1Sq Feet 420 రూ. మాత్రమే. ✆ 99660 66111.

తిరుపతి 6 లైన్స్ జాతీయ రహదారికి అనుకొని ఉన్న బత్తి లేఔట్‌లో 49వ ప్లాట్, గజలక్ష్మి లేఔట్‌లో 2వ ప్లాట్ అమ్మబడును. ✆ 87122 76826, 8978465644

WANTED
గోడౌన్ కావలెను. తిరుపతి పరిసర ప్రాంతాల్లో 50–70 అంకణములు, బోర్, స్టోరేజ్ ట్యాంక్, నీటి సౌకర్యములతో ఉన్న గోడౌన్ కావలెను. ✆ 8500960577.

BUSINESS SERVICE



BUSINESS OFFER
మీరు ఒక దుకాణదారా? మీకు ప్రతి నెలా ఆదాయం కావాలా? మీ దుకాణంకి ప్రచార ప్రకటనలు జోడి చేసి ప్రతి నెలా 7000/–ఇస్తాము. Contact Numbers: 9948000371, 9948000373

Wanted

వైభవ్ హోటల్ (కొత్త), రేణిగుంట నందు పని చేయుటకు అనుభవం గల వెయిటర్స్ (లేడీస్/జెంట్స్) క్యాషియర్ (30 సం॥లోపు) దోస మాస్టర్ కావలెను. ✆ 9182282880

హరేకృష్ణ హోంకేర్ హైదరాబాద్ నందు వృద్దులను, పేషెంట్స్‌ను చూసుకొనుటకు వర్కర్స్ / నర్సులు కావలెను. ఉచిత వసతి + భోజనం. జీ: 18k. ఫోన్ 9640258899, 9640468899

హైదరాబాద్‌లో ప్రముఖ యూనివర్సిటీలో 200 మంది (Ex-Army) సెక్యూరిటీ గార్డ్స్ కావలెను. (జీతం:8Hrs. 19,500/– & 12 Hrs. 28,200/–, 4సెలవులు + ఉచిత వసతి).ఫోన్ 9959433789

నాలుగులైన్ల ప్రకటనకు : రూ. 375/-
అదనపు లైనుకు : రూ . 90/-
ప్రతి ప్రకటనపై G.S.T 5% అదనం
Contact
9705444178
9951602970

గమనిక